సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 30 । మే । 2023



దిశ.. కొత్త దశ
దిశ పోలీస్‌స్టేషన్‌లతో కొత్త దశ మొదలైంది. చిన్నారులు, మహిళల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. -8లో



ఫుట్‌బాల్ టోర్నీ చాంపియన్‌గా స్పోర్ట్స్ స్కూల్
కడపలో నిర్వహించిన మినీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా వైఎస్ఆర్ క్రీడాపాఠశాల జట్టు నిలిచింది. -8లో



అంతర్ జిల్లా నేరస్తుడు అరెస్ట్
తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతూ, నగదు, నగలు అపహరిస్తున్న అంతర్ జిల్లాల దొంగ కావడి సోమశేఖర్ (26)ను మదనపల్లె పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో

న్యూస్‌రీల్

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారాలు సకాలంలో అందించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల వినతులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిష్కరించాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు పెండింగ్‌లో లేకుండా, రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. జేసీ గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు యదుభూషణ్‌రెడ్డి, ఆనంద్‌నాయక్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్: ఏపీ మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కడప రామాంజనేయపురం ఉర్దు రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ ఎస్ అబ్దుల్ రసూల్ తెలిపారు. కడప బాలురు, వేంపల్లె బాలికల గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో అన్ని సీట్లకు 6,7,8వ తరగతిలో మిగిలిన సీట్లకు ముస్లిం, దూదేకుల (బీసీ–బీ) మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్..ఐఎన్ వెబ్‌సైట్‌లో జూన్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 7780179446 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఫిర్యాదులపై స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులను నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

మీడియా ప్రతినిధులకు అక్రెడిటేషన్లు మంజూరు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు 2023–24 సంవత్సరానికిగాను మొదటి విడతగా 346 మందికి అక్రెడిటేషన్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జీఓ ఎంఎస్ నెంబరు 38లో ఉన్న అన్ని నిబంధనలను పాటించామన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఆర్ఓ సునీల్ సాగర్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లు.. సంక్షేమ పరవళ్లు

- నేటితో సీఎం వైఎస్ జగన్ పాలనకు నాలుగేళ్లు
- తరతమ బేధం లేకుండా జిల్లాలో అన్ని వర్గాలకు పథకాలు
- రైతు భరోసా కింద చేకూరిన లబ్ధి: రూ.1,064.78కోట్లు
- అమ్మ ఒడి పథకం ద్వారా: రూ.1,029.55 కోట్లు
- ఆరోగ్యశ్రీ ద్వారా జిల్లా వాసుల వైద్య ఖర్చులకు: రూ.473.94 కోట్లు



చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ప్రారంభించిన అనంతరం పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి కడప: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో అందిస్తూ ప్రజల మన్ననలు పొందారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు. పాలనను ప్రక్షాళన చేశారు. విద్యా విప్లవం తీసుకొచ్చారు.రాజకీయంగా ఆదరించి అక్కున చేర్చుకున్న వైఎస్సార్ జిల్లాలో వేల కోట్లు వెచ్చించి సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు సరికొత్తగా నిర్మించారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు(ఆర్బీకే), హెల్త్ సెంటర్లు, అర్హులకు పెన్షన్లు అమలు చేసేందుకు వలంటీర్ల వ్యవస్థ ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సంక్షేమ పథకాలను గ్రామీణుల చెంతకు చేర్చారు. పైసా అవినీతి లేకుండా నేరుగా ప్రభుత్వ పథకాలు లబ్ధిదారుల ఖాతాలకు చేరేవిధంగా సరికొత్తగా కొనసాగిస్తున్నారు.

చరిత్రాత్మకంగా గ్రామ సచివాలయ వ్యవస్థ

2019 అక్టోబరు 2న మహాత్మాగాంధీ జయంతి నాడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో 649 గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి గ్రామ స్థాయికి పాలనను తీసుకొచ్చారు. వీటి పరిధిలో 6490 మంది ఉద్యోగులను నియమించారు. ప్రజలకు పారదర్శకంగా, మెరుగైన సేవలు అందించేందుకు మరో 15 వేల మంది వలంటీర్లను నియమించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ నిర్ణయం చరిత్రలో నిలిచిపోనున్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

వ్యవసాయ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. చిన్న సన్నకారు రైతులకు పెట్టుబడులకు కోసం నాలుగేళ్లుగా రైతు భరోసా ద్వారా

రైతు భరోసా వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	అందజేసిన మొత్తం (రూ. కోట్లలో)
2019–20	2,06,708	279.93
2020–21	2,08,747	280.06
2021–22	1,99,344	269.11
2022–23	2,02,598	235.68

రూ.1,064.78 కోట్లు అందించారు. వ్యవసాయ సాగులో అన్నదాతలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో రైతు భరోసా కేంద్రాలను తీసుకవచ్చింది.

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి...

సంక్షేమంతోపాటు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు పనుల పూర్తికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇచ్చింది. తెలుగుగంగ, కేసీ కెనాల్ పరిధిలోని మిగిలిపోయిన పనులను పూర్తి చేసి సాగునీటిని అందించడంతోపాటు, జీఎన్ఎస్ఎస్ పరిధిలోని పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు సిద్ధమైంది. ఇందుకోసం రూ.1,100 కోట్లకు పైగానే ఖర్చు చేసిన ప్రభుత్వం తాజాగా మరో రూ.11 వేల కోట్లతో ఎర్రబల్లి లిఫ్ట్ స్కీమ్, గండికోట సీబీఆర్, గండికోట పైడిపాలెం లిఫ్ట్, పులివెందుల మైక్రో ఇరిగేషన్, జీఎన్ఎస్ఎస్ టు హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్, అలవలపాడు లిఫ్ట్, జీఎన్ఎస్ఎస్ మెయిన్‌కెనాల్ విస్తరణ పనులను చేపట్టుతోంది. కుందూ, తెలుగుగంగ లిఫ్ట్ పనులకు ప్రభుత్వం సైతం శ్రీకారం చుట్టింది. డిసెంబర్ నాటికి జీఎన్ఎస్ఎస్ పరిధిలో 50వేల ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమౌతోంది.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

జగనన్న అమ్మ ఒడి పథకం కింద

సంవత్సరం	లబ్ధి పొందిన తల్లులు	చెల్లించిన మొత్తం (రూ.కోట్లలో)
2019–20	2,55,587	383.38
2020–21	2,68,076	402.11
2021–22	1,87,742	244.06

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేసింది. పులివెందులలో రూ. 500 కోట్లతో కొత్తగా మరో మెడికల్ కళాశాల, కడప రిమ్స్‌లో రూ.107 కోట్లతో కేన్సర్ ఆస్పత్రి, రూ. 125 కోట్లతో సూపర్ స్పెషాలిటీ బ్లాకు, రూ.40.81 కోట్లతో మానసిక చికిత్సాలయం, పుష్పగిరి కంటి ఆస్పత్రి నెలకొల్పారు.

▸▸ పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట...

పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. కొప్పర్తి పారిశ్రామికవాడలో వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చర్ క్లస్టర్ ఏర్పాటు చేసింది. అందులో దాదాపు రూ.10వేల కోట్లు పెట్టుబడులు రానున్నాయి. తద్వారా లక్ష ఉద్యోగాలు దక్కనున్నాయి. గోపవరం సమీపంలో సెంచురీ ప్లైబోర్డ్స్ పరిశ్రమను రూ.956 కోట్లతో నిర్మించారు. దాదాపు 2,662 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు దక్కనున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నుంచి ఉత్పత్తులు రానున్నాయి. జమ్మలమడుగు సమీపంలో జేఎస్‌డబ్ల్యూ సంస్థ నేతృత్వంలో ఫిబ్రవరి 15 సీఎం భూమి పూజ చేశారు. తొలివిడతలో రూ.3,300 కోట్లతో 10లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించనున్నారు. రెండోవిడతలో రూ.5,500 కోట్లతో విస్తరించనున్నారు. జిల్లావ్యాప్తంగా 5లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి లభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

"వైఎస్ జగన్ అనే నేను ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తూ ముఖ్యమంత్రి పదవిని స్వీకరిస్తున్నాను. పదేళ్లుగా మీలో ఒకడిగా నిలిచినందుకు ఆకాశమంత విజయాన్ని అందించిన ప్రతి అక్కకు, ప్రతి చెల్లెమ్మకు, ప్రతి అవ్వకు, ప్రతి తాతకు, ప్రతి సోదరుడికి, ప్రతి స్నేహితుడికి రెండు చేతులు జోడించి పేరుపేరునా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. రాష్ట్రంలో 3,648 కిలోమీటర్లు చేపట్టిన పాదయాత్ర ద్వారా తెలుసుకున్న సమస్య పరిష్కరిస్తాను. రాజకీయాల కతీతంగా తరతమ బేధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం."

☛ 2019 ఏడాది మే 30వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలివి.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి మరిన్ని మెరుగులుదిద్ది 2,19,803 మందికి రూ.473.94 కోట్లు వెచ్చించారు.

నాడు–నేడుతో విద్యావిప్లవం....

రాష్ట్ర ప్రభుత్వం గడిచిన నాలుగేళ్లల్లో విద్యాభివృద్ధికి పెద్దపీట వేసింది. నాడు–నేడు పథకం ద్వారా తొలివిడతలో రూ.275 కోట్లతో 1,040 పాఠశాలలను అభివృద్ధి చేసింది. రెండో విడతలో రూ.296.62 కోట్లుతో 1,006 పాఠశాలల ఉన్నతికి నిధులు కేటాయించారు.మరోవైపు ప్రతి విద్యార్థి పాఠశాలకు వెళ్లేలా తల్లులు కృషి చేయాలని, ఆ మేరకు జగనన్న అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టి దీని ద్వారా రూ.1,029.55 కోట్లు తల్లుల ఖాతాలకు జమ చేశారు.

మహిళలను మహారాణులుగా....

మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దింది. అమ్మ ఒడి పథకం ద్వారా రూ.1,029.55 కోట్లు వారి ఖాతాలకు జమ చేయగా, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ. 683.93 కోట్లు ప్రభుత్వం అందించింది. డ్వాక్రా గ్రూపులకు సున్నావడ్డీ పథకం ద్వారా రూ. 205.89 కోట్లు వెచ్చించింది.వైఎస్సార్ చేయూత ద్వారా రూ. 621.46 కోట్లు అందించారు.జిల్లాలో 93,478 మందికి ఇంటి పట్టాలు అందించారు.సమాజంలో వివక్షతకు తావు లేకుండా ఉండేందుకు, అతివల గౌరవం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం విశేషం.

చేనేతలకు ఊపిరి పోసిన వైఎస్ జగన్

ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



మాట్లాడుతున్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నష్టాల్లో ఉన్న చేనేత రంగాన్ని ఆదుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. సోమవారం ఆప్కో కార్యాలయంలో వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల చేనేత సహకార సంఘ ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు ఆప్కో చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. సొసైటీలను అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు చేనేతలు నేస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేసేలా అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామన్నారు. 2022 డిసెంబరు 31 వరకు సహకార సంఘాల బకాయిలను చెల్లిస్తున్నామని తెలిపారు. నిల్వ ఉన్న స్టాక్‌ను 100 శాతం కొనుగోలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న బకాయిలను ఎండీ దృష్టికి తీసుకెళ్లి క్లియర్ చేయడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం కాలం చెల్లిన స్టాక్‌పై 66 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. జూన్ 1వ తేది నుంచి దాన్ని 75 శాతానికి పెంచుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆప్కో డైరెక్టర్లు అవ్వారు యల్లా సుబ్బరాయుడు, ఉదయగిరి వెంకటేశ్, చేనేత విభాగం డైరెక్టర్ లక్ష్మీదేవి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల చేనేత జౌళిశాఖ ఏడీలు బీమయ్య, శ్రీనివాసులురెడ్డి, ఆప్కో డీఎంఓ వరప్రసాద్, అభివృద్ధి అధికారి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

కడప రూరల్: జిల్లాలో ప్రథమ చికిత్సా కేంద్రాలు నిర్వహిస్తున్న ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. ఇందుకు సంబంధించి కొన్ని నిబంధనలు విధించారు. ఆర్ఎంపీలు తమ పేరుకు ముందు డాక్టర్ అని రాయకూడదు. బోర్డ్‌లో క్లినిక్ లేదా హస్పిటల్ అని రాయకుడదు, ప్రథమ చికిత్సా కేంద్రం అని మాత్రమే రాయాలి. బెడ్స్ ఉండకూడదు. అడ్మిషన్స్ చేయకూడదు. ఇంజక్షన్, ఐవీ ఫ్లూయిడ్స్, స్టెరైడ్ మందులు వేయకూడదు. . ఈ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి, అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ తెలిపారు.



నాలుగేళ్ల పాలనలో ఎన్నో మైలురాళ్లు



ప్రొద్దుటూరు: ర్యాలీలో ట్రాక్టర్‌ను నడుపుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



దువ్వూరు: స్కూటీపై ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల బైక్ ర్యాలీలు

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో ఎన్నో మైలురాళ్లను అధిగమించారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా, టీడీపీ మేనిఫెస్టోను వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా బైక్ ర్యాలీలు నిర్వహించారు. మైదుకూరు నియోజకవర్గంలోని దువ్వూరులో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో 3వేల బైక్‌లతో 25 కిలోమీటర్లు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. దువ్వూరులోని రామాలయం నుంచి మొదలైన ఈ ర్యాలీ గుడిపాడు, చింతకుంట, మైదుకూరు మీదుగా ఖాజీపేట కేసీ కెనాల్ బంగ్లా వరకూ సాగింది. ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీలు జయచంద్రారెడ్డి, వీరనారాయణరెడ్డి, సిద్దిఖ్, మైదుకూరు మార్కెట్ యార్డు చైర్మెన్ శ్రీమన్నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

- ప్రొద్దుటూరు పట్టణంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు.ఎమ్మెల్యే ట్రాక్టర్ తోలుతూ వచ్చారు. రామేశ్వరం ఆర్టీసీ బస్టాండు నుంచి మొదలైన ఈ ర్యాలీ అన్ని పురవీధుల్లో తిరిగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ పి. బంగారు రెడ్డి, జిల్లా ప్రచార కన్వీనర్ కె. నాగేంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బి. లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.
- కడప నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు మాసీమ బాబు, అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డిలు ర్యాలీని ప్రారంభించారు. పార్టీ కార్యాలయం నుంచి మొదలైన ఈ ర్యాలీ కోటిరెడ్డి సర్కిల్, ఎన్‌టీఆర్ సర్కిల్, ఏడురోడ్ల కూడలి, క్రిష్టా సర్కిల్, అప్సర సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా మళ్లీ వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరింది.
- పులివెందుల పట్టణంలోని మున్సిపల్ వైస్ చైర్మన్ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాత ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అన్ని వీధుల మీదుగా సాగింది. మున్సిపల్ ఛైర్మెన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు ఛైర్మెన్ చిన్నప్ప, సివిల్ సప్లైస్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

తిరిగి కొనసాగనున్న లోకేష్ పాదయాత్ర

– నేడు బహిరంగ సభ

జమ్మలమడుగు : టీడీపీ నేత నారా లోకేష్ పాదయాత్ర తిరిగి మంగళవారం నుంచి ప్రారంభం కానుందని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24, 25వ తేదీల్లో నారాలోకేష్ పాదయాత్ర పెద్దముడియం మండలంలో పూర్తయిందన్నారు. మహానాడు కార్యక్రమం ఉండటంతో పాదయాత్రకు బ్రేక్ పడిందని పేర్కొన్నారు. తిరిగి 30వ తేదీ మంగళవారం నుంచి పాదయాత్ర జమ్మలమడుగు పట్టణం మీదుగా వచ్చి బహిరంగ సభ ఉంటుందన్నారు. అనంతరం కన్నెలూరు మీదుగా గొరిగేనూరు, ధర్మాపురం మీదుగా దేవగుడి చేరుకుంటుందన్నారు. అనంతరం 31వ తేది పాదయాత్ర దేవగుడి మీద నుంచి సుగుమంచిపల్లె మీదుగా ప్రొద్దుటూరు సరిహద్దులకు చేరుకుంటుందన్నారు. మంగళవారం జరుగబోయే నారా లోకేష్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

హౌసింగ్ డీఈ సస్పెన్షన్

ఎర్రగుంట్ల : హౌసింగ్ శాఖ డీఈ విజయబాబును సస్పెన్షన్ చేస్తూ హౌసింగ్ ఎండీ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎర్రగుంట్ల జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులపై గతంలో అధికారులు విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. ఇక్కడ పని చేస్తున్న సచివాలయ అమ్యూనిటీ సెక్రటరీలను పులివెందుల, ప్రొద్దుటూరుకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. తాజాగా సోమవారం హౌసింగ్ డీఈ విజయబాబును సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ విషయంపై హౌసింగ్ డీఈ విజయబాబు మాట్లాడుతూ తన వివరణను ఉన్నతాధికారులకు తెలుపుతానని పేర్కొన్నారు.

గండిలో హుండీ ఆదాయం లెక్కింపు



నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి పేర్కొన్నారు. ఆలయంలోని హుండీల ద్వారా రూ.15,36,470, అన్నదానం సత్రంలోని హుండీ ద్వారా రూ.14,683 వచ్చినట్లు ఆయన తెలిపారు. అలాగే 6 గ్రాముల బంగారు, 300 గ్రాముల వెండి వచ్చిందని చెప్పారు. దేవదాయ శాఖ కడప తనిఖీ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, ఏపీజీబీ చక్రాయపేట మేనేజరు అశోక్, ఆలయ సిబ్బంది, ఆర్కే వ్యాలీ పోలీసులు పాల్గొన్నారు.

దిశ.. కొత్త దశ

- భార్యాభర్తల కలతలను దూరం చేస్తున్న పోలీసులు
- విడిపోతున్న కాపురాలను నిలబెడుతున్న వైనం
- విడతల వారిగా కౌన్సెలింగ్

దిశ పోలీస్‌స్టేషన్‌లతో కొత్త దశ మొదలైంది. చిన్నారులు, మహిళల సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. ఇవి ఎన్నో సమస్యలు పరిష్కరిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నాయి. ముఖ్యంగా ఆడపిల్లల కాపురాలను చక్కదిద్దుతున్నాయి.





భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారుల బృందం

కడప 'దిశ' పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారాలు

సంవత్సరం	జనరల్ ఫిర్యాదులు	ట్రిపుల్ సీ	పరిష్కారం	ఎఫ్ఐఆర్	పెండింగ్ కేసులు
2020	308	245	535	18	–
2021	926	296	1204	18	–
2022	525	844	1283	83	03
2023	209	325	423	93	18

కడప అర్బన్ : సమాజంలో భార్యాభర్తల అన్యోన్యతతో కుటుంబ అభివృద్ధి, తద్వారా పిల్లల శ్రేయస్సు, వారి ద్వారా సమాజాభివృద్ధి సుసాధ్యమవుతుంది. వారి మధ్య కలతలు కాపురంలో చిచ్చు రేపుతున్నాయి. గ్రామీణ స్థాయి నుంచి పట్టణ, నగర స్థాయికి వచ్చిన వారు తాము చేస్తున్న వ్యాపారాలు, ఉద్యోగాల 'బిజీ లైఫ్'తో తమ పిల్లల బాగోగులను పట్టించుకునే స్థితిలో వుండరు. దీంతో పిల్లలు శారీరక పెరుగుదల, ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు సాధిస్తున్నారు. కానీ తమ దైనందిన జీవితంలో తల్లిదండ్రులు, పెద్దలు, గురువులను ఎలా గౌరవించాలి. తాను జీవితాంతం తోడు నీడగా వుండాల్సిన భార్య, భర్త స్థానాలు ఎలా వుండాలి? అనే విధానాలపై 'మానసిక పరిపక్వత' చెందక అవగాహన రాహిత్యంతో 'సంసార జీవితాల'ను దూరం చేసుకుంటున్నారు. పూర్వకాలంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉమ్మడి కుటుంబాలు వుండేవి. అవ్వా,తాతలు తమ పిల్లలకు, మనువలు, మనువరాళ్లకు మంచి, చెడ్డా, కుటుంబ జీవన విధానం, సమాజంలో మెలిగే పద్ధతులను నేరిప్పించేవారు. రానురాను ఆ విధానంలో వచ్చిన మార్పులతో చిన్నచిన్న కుటుంబాలుగా విడిపోయి, జీవన విధానాలను నగరజీవితాలుగా మార్చుకుని భర్త, భార్య, పిల్లలుగా మారిపోయి ఆర్థికంగా మెరుగుపడాలనే తాపత్రయంలో పడిపోయారు. కాలక్రమేణ వారి పిల్లల కార్పొరేట్ చదువులపై వున్న శ్రద్ధ, వారి క్రమశిక్షణతో జీవితాన్ని సాగించేలా చూడాలనే విధానం సన్నగిల్లిపోయింది. అంతేగాక ఆడ,మగ పిల్లలను చిన్నతనం నుంచే వారికి ఇచ్చే స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలతో పెరిగి పెద్దవాళ్లయిన తరువాత కూడా అదే విధానం అవలంబించడం వల్ల జీవితగమనంలో విభేదాలు తలెత్తుతున్నాయి.

సమస్యల చుట్టూ పరిభ్రమిస్తున్న జీవితాలు

- ఆధునిక సాంకేతికతతో 'సెల్‌ఫోన్' లేకుండా చిన్న పిల్లాడి నుంచి పెద్దల వరకు వుండలేకపోతున్నారు. 'సెల్‌ఫోన్' దైనందిన జీవితంలో భాగమవడంతోపాటు, వ్యసనంగా మారింది. 'దిశ' మహిళా అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ వారు భార్యాభర్తల మధ్య ఏర్పడుతున్న కలతలకు కారణాలను తెలుసుకుని 'కౌన్సెలింగ్' అనే బ్రహ్మాస్త్రంతో తొలగించేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నారు. ఈ విధానం ద్వారా చాలా కేసుల్లో విజయవంతంగా ముందుకు వెళుతున్నారు.
- 18 ఏళ్ల వయసు రాగానే, పూర్తవకముందే కొందరు ఆడపిల్లలు తల్లిదండ్రులను సైతం లెక్క చేయకుండా తాను ప్రేమించిన యువకుడే సర్వస్వం అంటూ ముందుకు వచ్చి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఎంత త్వరగా జీవితాన్ని పంచుకోవాలనుకుంటున్నారో, వీరిలో కొందరు అంతే త్వరగా విడిపోవడానికి సిద్ధపడుతున్నారు.
- కొందరు తమ సెల్‌ఫోన్‌ల ద్వారా ఇంటిలో పడకగది నుంచి స్నానాల గదుల వరకు ఒకరిపై మరొకరు నమ్మకం లేక వీడియోలను తీసుకుంటూ వారి సంసారాన్ని వారే నాశనం చేసుకుంటున్నారు.
- విద్యావంతులైన వారే కొందరు ఆడపిల్లలు తమ వైవాహిక జీవితాన్ని ఆరు నెలలకు గానీ, ఏడాది పూర్తవక ముందే భర్త సంసారానికి పనికిరాడని నిర్ణయించుకుంటున్నారు. 'కౌన్సెలింగ్ పీరియడ్' రెండు నెలల కాలం పూర్తవక ముందే 'కక్షసాధింపు' ధోరణిలో ప్రవర్తిస్తూ విడిపోతున్నారు.

కడప 'దిశ' పోలీస్ స్టేషన్ ద్వారా అందిస్తున్న సేవలు

- కడప దిశ పోలీస్‌స్టేషన్‌కు నేరుగాగానీ, జిల్లా ఎస్పీ నిర్వహించే 'స్పందన' ద్వారా వచ్చే భార్యాభర్తల, మహిళల, చిన్నపిల్లల సమస్యలు, నేరాలకు సంబంధించిన ఫిర్యాదులను డీఎస్పీ స్థాయి అధికారి దృష్టికి వస్తాయి. ఆయన ఆదేశాల మేరకు మొదట బాధితుల సమస్యలను తెలుసుకుంటారు. భార్యాభర్తల మధ్య ప్రాథమికంగా మనస్పర్థలను తొలగించేందుకు ఇక్కడి సిబ్బంది ప్రయత్నిస్తారు. లేదంటే మొదటి రెండు నెలలు 'కూలింగ్ పీరియడ్'లో మూడు లేదా ఐదు కౌన్సెలింగ్‌లను నిర్వహించి వారి మధ్య విభేదాలను తొలగించి సజావుగా కాపురం చేసుకునేలా ప్రయత్నిస్తారు. కలువలేని పరిస్థితుల్లో వారి ఇష్ట ప్రకారం ఎఫ్.ఐ.ఆర్‌లను తమ పరిధిలో గానీ, ఆయా పోలీస్‌స్టేషన్‌ల ద్వారా నమోదు చేయిస్తారు. తరువాత న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఈ కౌన్సెలింగ్‌లను ప్రతి మంగళవారం, శనివారం నిర్వహిస్తారు. ఈ కౌన్సెలింగ్‌కు భార్యాభర్తలను విడివిడిగా పోలీసు అధికారి, మనస్తత్వశాస్త్ర నిపుణులు, న్యాయవాదులు, ఎన్జీఓ సంఘానికి చెందిన సభ్యుల సమక్షంలో విచారణ చేస్తారు. తరువాత ఇద్దరిని కలిపి విచారణ చేసి విడిపోతే కష్ట,నష్టాలు, కలిసుంటే జీవితాంతం సంసారం సాఫీగా సాగుతుందని 'పోస్ట్ మేరిటల్ కౌన్సెలింగ్' విధానం ద్వారా వివరిస్తారు. గతంలో ప్రతి మంగళవారం, శనివారం కౌన్సెలింగ్‌ను ఐదు జంటలలోపు నిర్వహించేవారు. ప్రస్తుతం 10 నుంచి 15 జంటలకు నిర్వహించాల్సి వస్తోంది.
- కొందరు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు తమ ఆడపిల్లలకు తక్కువ వయసులోనే వివాహం చేస్తుంటారు. వారికి వైవాహిక జీవితంపై అవగాహన వుండదు. అలాంటి జంటలకు కౌన్సెలింగ్ ద్వారా వారి మధ్య మనస్పర్థలు తొలగించి, వారిని ఒక్కటిగా చేసి పంపిస్తున్నారు.
- ఉద్యోగం వుంటే ఆర్థిక స్వేచ్ఛ కలిగి వుంటుందని కొందరు మహిళలు గానీ, పురుషులుగానీ వివాహేతర సంబంధాలు, రెండో వివాహంపై మొగ్గు చూపుతూ సంసారాన్ని నాశనం చేసుకుంటున్నారు. అలాంటి వారిలో కొందరిని కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా కలుపుతున్నారు. కొందరు ఎన్ని కౌన్సెలింగ్‌లు నిర్వహించినా అవగాహన రాహిత్యంతో దూరంగానే వుంటున్నారు.

మచ్చుకుకొన్ని..

- పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాక తన భర్త సంసారానికి పనికిరాడని తెలుసుకుని తల్లిదండ్రులకు చెప్పలేక తనలోనే కుమిలిపోయి నరకం అనుభవించింది. డబ్బుల కోసం తన భర్త మరో వివాహానికి సిద్ధపడితే పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు వాస్తవాలను విచారణ చేసి వారు విడిపోతేనే మంచిదని భావించారు.
- తనను ప్రేమించిన సమయంలో ఫొటోలు తీసుకున్న యువతిని, వేరే వివాహం చేసుకున్న తరువాత ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి న్యూడ్ ఫొటోలుగా మార్చి 'బ్లాక్ మెయిలింగ్'కు పాల్పడిన ఓ యువకుడిని పిలిపించి, సదరు న్యూడ్ ఫొటోలను తొలగించి, చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం జరిగేలా కృషి చేశారు.
- ఓ తొమ్మిదినెలల పసిబాబును, భార్యను మనస్పర్థలతో దూరం చేసుకున్న భర్తను ఒకేఒక్క కౌన్సెలింగ్ ద్వారా వారిని కలిపి పంపించారు.
- కొందరు భర్తలు మద్యం, ఇతర చెడు వ్యసనాలకు బానిసలుగా మారి వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించడం, అవసరమైతే 'డీ అడిక్షన్' సెంటర్‌లకు పంపించి వారిని కలిపేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నారు.

కౌన్సెలింగ్ ద్వారానే మనస్పర్థలకు చెక్



భార్యాభర్తల మధ్య ఏర్పడిన విభేదాలను తొలగించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతో కృషి చేస్తున్నాం. ప్రతి మంగళ, శనివారాలలో 'కౌన్సెలింగ్'ను నిర్వహించి వారి మధ్య అభిప్రాయ భేదాలను తొలగించి న్యాయం జరిగేలా చూస్తున్నాం. మహిళలు, చిన్నారుల పట్ల జరిగే నేరాల నియంత్రణకు అహర్నిశలు పనిచేస్తున్నాం. 'దిశ' యాప్‌ను జిల్లా వ్యాప్తంగా మహిళల చేత డౌన్‌లోడ్ చేయించాం. ఆపద సమయాలలో ఆదుకుంటున్నాం.

– ఎస్.రమాకాంత్, కడప 'దిశ' డీఎస్పీ

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

చాపాడు : మండల పరిధిలోని రాజువారిపేటలో బండలాడుగు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆ గ్రామంలో వీరాంజనేయ స్వామి దేవాలయ 14వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి వీరాంజనేయుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు ఎంపీపీ లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జయసుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృషభరాజములచే బండలాడుగు పోటీలు నిర్వహించారు. నంద్యాల జిల్లా పీఆర్ పల్లెకు చెందిన గుండం చిన్నరెడ్డి, శివకోటి ఎద్దులు 3687 అడుగులతో ప్రథమ స్థానం, వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన కేవీఎస్ బుల్స్, కుర్ర వెంకటేశ్ ఎద్దులు 3621 అడుగులతో ద్వితీయ, బాలయ్యగారిపల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్దులు 3300 అడుగులతో తృతీయ స్థానం సాధించాయి. తిప్పిరెడ్డిపల్లెకు చెందిన వడ్డెమాను విశ్వనాథ్‌రెడ్డి ఎద్దులు 3084 అడుగులతో నాలుగో స్థానం, గుంటూరు జిల్లా వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష చౌదరి కృష్ణ ఎద్దులు 3000 అడుగులతో ఐదవ, కడప జిల్లా పోతిరెడ్డిపల్లెకు చెందిన మూలే ప్రసాద్‌రెడ్డి ఎద్దులు 2730 అడుగులతో ఆరవ, పెద్దపుత్తకు చెందిన గంగిరెడ్డి శంబురెడ్డి, వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు 2700 అడుగులతో ఏడవ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల ఎజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు.



బండను లాగుతున్న ఎద్దులు

హౌసింగ్ లక్ష్యం అధిగమించాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో నిర్ణీత లక్ష్యం మేరకు జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ విజయరామరాజు క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక అధికారులు లక్ష్య సాధనపై దృష్టి సారించాలన్నారు. ప్రాధాన్యత బిల్డింగ్‌ల పనుల నిర్వహణలో వారానికి నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయగలిగితే అధిగమించగలమన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నాడు–నేడు పనుల నిర్వహణపై ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో బయోమెట్రిక్ హాజరు సక్రమంగా జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై అటెండెన్స్ వంద శాతం నమోదు కావాలని ఎంపీడీఓలు, కమిషనర్లను ఆదేశించారు. ఏపీ సేవా సర్వీసులను సక్రమంగా చేపట్టాలన్నారు. కల్యాణమస్తు పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలని చెప్పారు. పన్ను వసూళ్లు, హౌసింగ్, జగనన్న విద్యా దీవెన పథకాలకు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ గణేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్లు రాహుల్‌మీనా, మౌర్య భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

అంతర్ జిల్లా నేరస్తుడు అరెస్ట్

- రూ.9 లక్షల నగలు స్వాధీనం
- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు
- చిత్తూరు, సత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో చోరీలు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేశప్ప



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

మదనపల్లె : తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతూ, నగదు, నగలు అపహరిస్తున్న అంతర్ జిల్లాల దొంగ కావడి సోమశేఖర్ (26)ను మదనపల్లె టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.9 లక్షల విలువైన 156.7 గ్రాముల బంగారు, వెండి నగలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ కేశప్ప వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఇటీవల మదనపల్లె డివిజన్‌లో పలు చోరీ కేసులు నమోదు కావడంతో టూటౌన్ సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారన్నారు. అందులో భాగంగా ముందస్తుగా అందిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి పట్టణంలోని చౌడేశ్వరీదేవి సర్కిల్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. మదనపల్లె పట్టణం చీకిలుగుట్ట గౌతమీనగర్‌కు చెందిన కావడి సోమశేఖర్‌గా గుర్తించి విచారించగా నిందితుడు అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయి జిల్లాల్లో 2014 నుంచి ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. అతని వద్ద నుంచి 77.5 గ్రాముల బంగారు నగలు, 245 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. అంతేకాకుండా విచారణలో భాగంగా మదనపల్లె పట్టణం రామారావుకాలనీకి చెందిన సాయికిరణ్, అతని భార్య శేషాబాయి, ఆమె చెల్లులు దేవదానమ్మలతో కలిసి చోరీ సొత్తును వారి పేరుతో పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన మూడు రసీదులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి ఆధారంగా ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ నుంచి మరో 79.2 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు సాయికిరణ్, శేషాబాయి, దేవదానమ్మలతో కలిసి ఫైనాన్స్ కంపెనీలో నగలు తాకట్టు పెట్టిన అనంతరం వచ్చిన సొమ్మును వాటాలుగా పంచుకునే వారని తెలిపారు. చోరీ సొత్తును పంచుకున్న సాయికిరణ్, శేషాబాయి, దేవదానమ్మలపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. సాయికిరణ్ ఇప్పటికే సారా కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్నాడని, పిటీవారెంట్ ద్వారా అతన్ని విచారణకు తీసుకుంటామన్నారు. మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. నిందితుడిపై పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెండు, తాలూకా పోలీస్‌స్టేసన్‌లో రెండు, పీలేరు, వాల్మీకిపురం, కలికిరి, సత్యసాయి జిల్లా కదిరి, చిత్తూరు జిల్లా కల్లూరు తదితర పోలీస్‌స్టేషన్లలో 15 చోరీ కేసులు నమోదైనట్లు తెలిపారు. పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవించినట్లు తెలిపారు. నిందితునిపై నాన్‌బెయిలబుల్‌వారెంట్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలియజేశారు. నిందితుడు తెలివిగా చోరీ చేయాల్సిన ఇళ్లను ముందుగానే ఎంపిక చేసుకుని రెక్కీ నిర్వహించేవాడని, ఆయా ప్రాంతాల్లో పోలీసుల కదలికలపై నిఘా ఉంచేవాడని తెలిపారు. ప్రస్తుతం ఏడు కేసుల్లో నిందితునిగా పేర్కొంటూ సోమశేఖర్‌ను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ లోకేష్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాసులు, మునిరత్నం, రెడ్డిప్రసాద్, భద్రనాయక్, రెడ్డిశేఖర్‌లను పోలీస్ రివార్డుకు సిపార్సు చేస్తున్నట్లు వివరించారు.

ఫుట్‌బాల్ టోర్నీ చాంపియన్‌గా స్పోర్ట్స్ స్కూల్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని సీఎస్ఐ క్రీడా మైదానంలో నిర్వహించిన మినీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా వైఎస్ఆర్ క్రీడాపాఠశాల జట్టు నిలిచింది. అండర్–14 విభాగంలో డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాల జట్టు విజేతగా నిలువగా, రెండో స్థానంలో నంద్యాలకు చెందిన ఎస్.ఎఫ్.సి. జట్టు నిలిచింది. అండర్–17 విభాగంలో కడప డీఎస్ఏ థండర్స్ జట్టు విజేతగా నిలువగా, రెండో స్థానంలో కడపకే చెందిన బ్లాంక్ పాంథర్స్ జట్టు నిలిచింది. సీనియర్స్ విభాగంలో సీఎస్ఐ ఫుట్‌బాల్ జట్టు, వైఎస్ఆర్ క్రీడాపాఠశాల జట్లు సంయుక్తంగా విజేతగా నిలిచాయి. మూడో స్థానం డీఎస్ఏ జట్టు, నాల్గవ స్థానం ఆర్ట్స్ కళాశాల జట్టు పొందాయి. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాప్ బోర్డు డైరెక్టర్ డానియల్ ప్రదీప్ అతిథిగా విచ్చేసి ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో మినీ ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, కార్యదర్శి థామస్, క్రీడాకారులు పాల్గొన్నారు.



అండర్-14 విజేతగా నిలిచిన క్రీడాకారులు



అండర్-17లో విజయం సాధించిన వారు

నేడు డీఈఓ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పాఠశాల విద్యాశాఖ పరిధిలో పని చేస్తున్న బోధనేతర సిబ్బంది అయిన సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లు, స్వీపర్లకు మంగళవారం ఉదయం 9 గంటలకు డీఈఓ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ఐదు సంవత్సరాలు ఒకే స్థానంలో సర్వీసు పూర్తి చేసిన వారు, రిక్వెస్టు బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారు తప్పనిసరిగా డీఈఓ కార్యాలయంలో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

రైల్వేకోడూరు : మండలంలోని సూరపురాజుపల్లి రైల్వేబ్రిడ్జి మీద రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. తమకు సమాచారం రావడంతో వెళ్లి పరిశీలించామని ఆయన పేర్కొన్నారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. అలాగే బ్రిడ్జి దగ్గర ఒక పల్సర్ బైక్ ఉందని, ఆ బైక్ వివరాలు చూడగా గంపల నవీన్ తండ్రి ఈశ్వరయ్య అని ఉందని, పూర్తి స్థాయిలో వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

ఫోరం ఫర్ సోషల్ కన్వీనర్‌గా నరసింహులు



రాజంపేట : ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జాతీయ కన్వీనరుగా అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన న్యాయవాది కేఎంఎల్ నరసింహులు ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆయన సోమవారం ఇక్కడి విలేకరులకు తెలియచేశారు. బీహార్ రాష్ట్రమైన పాట్నాలో ఆదివారం 29 రాష్ట్రాల సమావేశంలో దక్షిణ భారతదేశం నుంచి కేఎంఎల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందుకు సహకరించిన బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ, ఎన్సీపీ అధినేత శరద్‌పవార్, ఎంఐఎం నేత ఓవైసీ, తెలంగాణ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.